క్లుప్తంగా

పాఠశాలను సందర్శించిన తహసీల్దార్



ఊట్కూరు: మండలంలోని అమీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం తహసీల్దార్ రవి సందర్శించారు. పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు ఆనందమ్మ, ముకుంద పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల్లో లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదనే నేపంతో దరఖాస్తులను తిరస్కరించడం సరికాదని బీజేపీ నాయకులు సింగారం ఆంజనేయులు అన్నారు. అభయహస్తం దరఖాస్తులు నమోదుకు వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలని కోరుతూ.. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.

శబరిమలకు తరలిన అయ్యప్పస్వాములు



ధన్వాడ: 40రోజుల పాటు నియమనిష్టలతో అయ్యప్పమాల ధరించిన స్వాములు గురువారం శబరికి తరలి వెళ్లారు. మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురుస్వాములు మాకంసురేందర్ ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఇరుముడులతో ఆలయం నుంచి బస్‌స్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లారు. గురుస్వాములు ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, వేణు, నవీన్, వెంకటేష్, శ్రీనివాసులు ఉన్నారు


డీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

మరికల్: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హన్మంతు, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, ఉపాధ్యక్షుడిగా చైతన్య, కార్యదర్శిగా తిరుపతయ్యను ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర తెలిపారు. డీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలి

నారాయణ పేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర బీసీ లెక్చరర్ల అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మడిగల వెంకట్రాములు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. దాదాపుగా ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులందరూ దిగువ మధ్య తరగతికి చెందినవారేనని, ప్రభుత్వం స్పందించి ఈ విషయంపై ఆలోచించే దిశగా అడుగులు వేయాలని కోరారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నారాయణపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యతగా విద్యార్థులకు అందించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కొల్లంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు.. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నాణ్యతగా అందించాలన్నారు. వారంలో మూడు రోజులు గుడ్డు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు వెంకటేష్, విక్టర్ పాల్, పార్వతి పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్ రాజీనామా చేయాలి

మరికల్: వైకుంఠ ద్వారం దర్శన టిక్కెట్ల పంపిణీలో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలను కోల్పోవడానికి కారణమైన టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో అన్నారు. తిరుపతికి దర్శన నిమిత్తం వచ్చే భక్తుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న టీటీడీ చైర్మన్ ఆ పదవిలో ఉండే హక్కు లేదన్నారు. మృతుల్లో ఒక్కొక్కరికీ రూ. 50 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఊట్కూరులో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ కృష్ణంరాజు



కృష్ణాలో వాహనదారులకు పండ్లు పంపిణీ చేస్తున్న వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్

రోడ్డు నిబంధనలు పాటించాలి

నారాయణపేట: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని ఎస్‌ఐ గాయత్రి సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద వాహనదారులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మద్యం తాగి వాహనాలు నడపొద్దని, హెల్మెట్ సీట్ బెల్ట్ ఉపయోగించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దని, సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, పీసీలు హన్మంతు, సంతోష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పేటలో వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ గాయత్రి

విద్యార్థులకు అవగాహన

ఊట్కూరు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ఎస్‌ఐ కృష్ణంరాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ చట్టాలు, షీటీం, ర్యాగింగ్, సైబర్ నేరాలు నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు ఫోన్ చేయాలని కోరారు. అధ్యాపకులు సత్యనారాయణ, బసవయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలి..

కృష్ణా: మాగనూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ రుబీన ప్రవీన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్షణ చట్టాలు, షీటీం, ర్యాగింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా రోడ్డు నియమ నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అశోక్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, అల్పాహారం పంపిణీ

కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని చెక్‌పోస్టులో రోడ్డు భద్రత వారోత్సవాల భాగంగా వాహనదారులకు అసిస్టెంట్ మోటార్ వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ హెచ్ ప్రవీన్ కుమార్ పండ్లు, అల్పాహారాన్ని అందించి వారికి పలు సూచనలు చేశారు. అలాగే లారీ డ్రైవర్లు రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని, వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ అధికారులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నారాయణపేట: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండి పనిచేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ పేట ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను కలెక్టర్, ఆర్‌డీఓ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఉద్యోగి సంతోషంగా పనిచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీజీఆర్ఎస్ఏ అధ్యక్షుడు చింత రవి, కార్యదర్శులు ఎం.శ్రీకాంత్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కలిసి పనిచేద్దాం

నారాయణపేట రూరల్: టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యారంగా అభివృద్ధికి కలిసి పనిచేద్దామని, టెన్త్ పరీక్షల్లో జిల్లాను రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కోరారు. నాయకులు రెడ్డప్ప, వెంకటప్ప, ఉదయ్ కుమార్, దశరథ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



మద్దూరు: విద్యార్థులకు చదువుతోపాటు శారీరక దృఢత్వం కోసం క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సంస్థ ప్రతినిధులు పద్మ, నాగమ్మ అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, క్రీడలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వారు మాట్లాడారు.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ క్రీడా పోటీల్లో మండంలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నరేష్, కృష్ణయ్య, కేశీబాయి పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

కృష్ణా: అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు రైతు భరోసా కింద రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రూ. 12వేలు ఇస్తామని ప్రకటించడం రైతులను దగా చేస్తుందని రైతు సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మాగనూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉమ్మడి మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అడుగడుగునా రైతులను మోసం చేస్తున్నదని, రైతు రుణమాఫీని కూడా పూర్తి స్థాయిలో చేయలేదని విమర్శించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి ప్రతాన్ని శిక్షణ కలెక్టర్ గరిమనురులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, శివరాజ్‌పాటిల్, వెంకటయ్య, మల్లారెడ్డి, శివప్ప, పల్లె మారెప్ప, అశోక్, మాలింగప్ప, తాయప్ప, ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జ్యోతిరావు పూలే బీసీ సంఘం కమిటీ ఎన్నిక

కృష్ణా: మండల పరిధిలోని గుడెబల్లూర్‌లో గురువారం మహాత్మజ్యోతిరావు పూలే బీసీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని బీసీలు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించే దిశగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, వాకిటి ఆంజనేయులు, బస్సప్ప, కొంకల్ సాబ్, చిన్న ఎల్లప్ప, మారెప్ప పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి..



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

మరికల్: ప్రభుత్వం బీడీ కార్మికులకు జీవన భృతి కింద నెలకు రూ. 4వేలు ఇవ్వాలని టీయూసీఐ రాష్ట్ర నాయకులు అరుణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీడీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారికి జీవన భృతి కింద రూ. 4వేలు చెల్లిస్తామని ఓట్లు వేయించుకొని మోసం చేయడం తగదన్నారు. మృతి చెందిన కార్మికులకు రూ. లక్ష ఇన్స్‌రెన్స్‌తోపాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బలరాం, జానకమ్మ, ఉమాదేవి, లక్ష్మీ, ఫరీదాబేగం పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లి, బిడ్డ క్షేమం



మక్తల్: మండలంలోని మంతన్‌గోడ్ గ్రామానికి చెందిన నర్సింగమ్మ అనే మహిళకు పురిటి నొప్పులు రాగా కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారాన్ని అందజేశారు. నర్సింగమ్మను అంబులెన్స్‌లో మక్తల్ ప్రభుత్వ దవాఖానకు తరలిస్తున్న క్రమంలో నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్ సిబ్బంది సుఖ ప్రసవం చేశారు. నర్సింగమ్మ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారు. తమ బిడ్డకు ప్రసవం చేసిన 108 అంబులెన్స్ సిబ్బందికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రైతు దినోత్సవం

కృష్ణా: మండల కేంద్రంలోని జ్ఞాన సంఘమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల చైర్మన్, బీఆర్ఎస్ మండల నాయకుడు శివరాజ్‌పాటీల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉత్తమ రైతులకు సన్మాన కార్యక్రమంల చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి జాన్‌సుధాకర్, మార్కెట్ చైర్మన్ రాధలక్ష్మారెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు.

గ్రామ అభివృద్ధికి ఐక్యమత్యంతో పనిచేద్దాం



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

మరికల్: గ్రామ అభివృద్ధి కోసం యువత ఐక్యమత్యంతో పనిచేయాలని నూతనంగా ఎన్నుకున్న యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని యువక మండలి భవనంలో గురువారం నూతన కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డితోపాటు కో-శాధికారి అంజప్ప, మహిందర్‌రెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి, క్రీడా కార్యదర్శి అశోక్, సాంస్కృతి కార్యదర్శి రాజశేఖర్ ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం అఖిల పక్షం పార్టీల నాయకులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, బసంత్, సూర్యప్రకాష్, సుదర్శన్, వెంకట్రాములు, రవికిరణ్, మల్లయ్య, హరిష్, కృష్ణయ్య, జగదీష్, రామన్‌గౌడ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక

మక్తల్: రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు మక్తల్‌కు చెందిన క్రీడాకారుడు భరత్‌కుమార్ ఎంపికై నట్లు హెచ్‌ఎం పరందరాములు గురువారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 6, 7 తేదీలలో మేడ్చల్ జిల్లా కీసరలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సైక్లింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. రోడ్డు స్పీడ్ 5కిలో మీటర్లు సైక్లింగ్ పోటీల్లో గెలుపొందారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడిని హెచ్‌ఎం పరందరాములు అభినందించారు.



సనాతన ధర్మంపై ప్రజలను చైతన్యం చేద్దాం

ఊట్కూరు: సనాతన హిందూ ధర్మం పట్ల ప్రజలను చైతన్యం చేద్దామని నేరుడగం పీఠాధిపతి పంచమ సిద్ధిలింగేశ్వరస్వామి కోరారు. గురువారం మండలంలోని వీరభద్రేశ్వర ఆలయంలో పుణ్యారాధన 60వ మహోత్సవాల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చేనెల 16, 17, 18 తేదీలలో ఉత్సవాలను నేరుడగం మఠం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరయ్యస్వామి, భక్తులు బాల్‌రెడ్డి, భాస్కర్, సూర్యప్రకాష్‌రెడ్డి, నీల్‌రాజు, భసంత్, గోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న పీఠాధిపతి

ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్న అధికారులు

మద్దూరు: మండలంలోని దోరేపల్లి, నందిపాడ్, కొత్తపల్లి, గోకుల్‌నగర్ గ్రామాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకోసం గురువారం తహసీల్దార్లు మహేష్‌గౌడ్, ఆనంద్‌కుమార్ ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. ప్రభుత్వం మహిళలను స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంలో 'కుసుమ' ప్రాజెక్టు ద్వారా సోలార్ ప్లాంట్‌లను ఏర్పాటుచేసిన వారికి అప్పగించాలని యోచిస్తుందని ఇందులో భాగంగా మండలంలోని దోరేపల్లిలో సర్వే నంబర్ 236, నందిపాడ్‌లో 67, గోకుల్‌నగర్‌లో 58, కొత్తపల్లిలో 163 సర్వే నంబర్లను గుర్తించినట్లు తహసీల్దార్లు తెలిపారు. ఈ భూములకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు. వీరితోపాటు ఐకేపీ ఏపీఎం నారాయణ, విద్యుత్ ఏఈ బాల్‌రాజ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నందిపాడ్‌లో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

నారాయణపేట రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఆశ చూపి మోసం చేసిందన్నారు. పంట పెట్టుబడికి రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని చెప్పి ఒక ఏడాది రైతు భరోసా ఎగ్గొట్టి ఇప్పుడు ఎకరాకు రూ.12 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. ఈ ప్రభుత్వానికి రైతులపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. అలాగే మహిళలకు నెలకు రూ.2500, నిరుద్యోగ భృతి, పింఛన్లు పెంపు, పేదలకు ఇళ్లు ఇలా అనేక హామీలు ఇచ్చి అందరినీ మోసం చేసిందని విమర్శించారు. వీటి బాగోతాలు ప్రజలకు వివరించి కార్యకర్తలు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి బీజేపీ గెలుపునకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పగుడాకుల శ్రీనివాసులు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి గోవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దండోర ధూంధాం ప్రచార రథయాత్ర



మాట్లాడుతున్న ప్రమోద్‌మాదిగ

కోస్గి రూరల్: వెయ్యి గొంతుకలు లక్ష డప్పులు మహ కళాప్రదర్శనలో భాగంగా దండోర ధూంధాం ప్రచార రథయాత్రను చేపట్టామని జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ మాదిగ అన్నారు. గురువారం పట్టణంలోని హరిజన్‌వాడ నుంచి శివాజీ చౌరస్తా వరకు డప్పు కళాకారులు దండోర దూందాంను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతి గొప్పతనాన్ని, వారికి జరిగిన నష్టాన్ని, ఏబీసీడీల వర్గీకరణలో పడ్డకష్టాలను వివరించారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి నాగరాజు, శివకుమార్, ఝాన్సీ, రోజా, ప్రవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆశాకార్యకర్తల నిరసనలు

నారాయణపేట: ఆశాకార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని కోరుతూ.. శుక్రవారం ఉదయం 10 గంటలకు పేట నియోజకవర్గ కేంద్రాల్లోని ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేయనున్నామని సీఐటీయూ నాయకులు వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రాం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా నియోజకవర్గ పరిధిలోని ఆశా కార్యకర్తలందరూ పాల్గొని గురువారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కనీస వేతనం రూ.18వేలు ఇస్తామని జీఓ విడుదల చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఆశలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

బీజేపీ మండల, పట్టణ కమిటీల ఎన్నిక



సభ్యులను సన్మానిస్తున్న జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి

నారాయణపేట రూరల్: బీజేపీ పార్టీ జిల్లాలోని వివిధ మండల, పట్టణ కమిటీలకు అధ్యక్షులు నియామకాన్ని గురువారం చేపట్టింది. ఈ మేరకు 20కమిటీలకు గాను 15చోట్ల ప్రక్రియ పూర్తయిందని, వాటికి సంబంధించిన జాబితాను విడుదల చేసి బాధ్యులను సంస్థాగత ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి శాలువాతో సన్మానించారు. పేట పట్టణ అధ్యక్షుడిగా వినోద్, మక్తల్ పట్టణ అధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి, కోస్గి అధ్యక్షుడిగా పి.ప్రశాంత్, పేట మండల అధ్యక్షుడిగా సీహెచ్. జ్యోతి, దామరగిద్ద సంజీవ్ గౌడ్, మరికల్ వేణుగోపాల్, ధన్వాడ శివరాజ్, కోయిలకొండ మధుసూదన్ రెడ్డి, మక్తల్ ప్రతాప్ రెడ్డి, మాగనూర్, కృష్ణ మండలానికి ఎన్ నర్సప్ప, ఆత్మకూర్ అశోక్ భూపాల్, అమరచింత మంగ లావణ్య, నర్వ అజిత్ సింహారెడ్డి, మద్దూరు కమ్మరి శంకర్, దౌల్తాబాడ్ అశోక్ ఎంపికయ్యారు.

భూముల అన్యాక్రాంతంపై విచారణ చేయాలి

కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిపై రెవెన్యూ అధికారులు విచారణ చేయాలని బీసీ సంఘం నాయకులు శ్రావణ్‌కుమార్, ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. దాదాపు వంద ఎకరాల ప్రభుత్వ భూములు అక్రమార్కులు స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం విచారకరమని అన్నారు. అధికారులు స్పందించకపోతే తాము ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

కార్యాలయంపై దాడులు అప్రజాస్వామికం

మక్తల్: కాంగ్రెస్ నాయకులు అధికార గర్వంతో బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం అప్రజాస్వామికమని బీజేవైఎం జిల్లా మహేష్ సాగర్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటుచేసిన స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడితే జీర్ణించుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం దాడులకు ప్రోత్సాహించడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహ, రాజుగౌడ్, రాజు, ఆంజనేయులు, ఆనంద్, దండుశ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఆర్‌టీఐ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న సభ్యులు

దామరగిద్ద: సమాచార హక్కు పరిరక్షణ కమిటీ మండల అధ్యక్షుడిగా బ్రహ్మయ్య ఎన్నికయ్యారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు గణేష్ సమక్షంలో గురువారం కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. సమాచార హక్కుచట్టంపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం సమాచార హక్కు చట్టం కమిషనర్‌లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీన్‌కుమార్, కార్యదర్శిగా అచలానంద, యూత్ కన్వీనర్‌గా మహేష్ ఎన్నికయ్యారు.

పలకల పంపిణీ

అమరచింత: మండల కేంద్రంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులకు గురువారం దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో పలకలు పంపిణీ చేశారు. దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సమితి ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సేవా సమితి అధ్యక్షుడు కలాంపాషా తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగేంద్రమ్మ పాల్గొన్నారు.